

క్లుప్తంగా

పైపులైన్ ఏరియాల్లో పంట ఉత్పత్తులు ఆరబోయొద్దు

ఖానాపురం : మిషన్ భగీరథ పైప్‌లైన్ ఏరియాల్లో రైతులు మక్కజొన్నలు, ధాన్యం, ఇతర పంట ఉత్పత్తులు ఆరబోయొద్దని ఏఈ సతీశ్ కోరారు. మండలంలోని మంగళవారిపేట, తదితర గ్రామాల్లో మక్కజొన్న ఆరబోసిన రైతులతో ఆయన మాట్లాడారు. మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతున్న పైప్‌లైన్లు ప్రమాదవశాత్తు లీక్ అయ్యే అవకాశాలు ఉంటాయని చెప్పారు. లీకేజీలు ఏర్పడిన చోట ధాన్యం, మక్కజొన్నలు ఉంటే తడిసిపోయి నష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు.

విద్యుత్ పరికరాల దహనం

నల్లబెల్లి : రైతు వ్యవసాయ బావి వద్ద ఏర్పాటు చేసుకున్న విద్యుత్ పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేసిన ఘటన మండలంలోని రుద్రగూడెంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. రుద్రగూడెంకు చెందిన గాదె మహేందర్ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆదివారం రాత్రి వరి, మక్కజొన్న పంటలకు నీళ్లు పెట్టేందుకు వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా అప్పటికే గుర్తు తెలియని వ్యక్తులు స్టాటర్, కరెంటు వైరు, ఫ్యూజులకు నిప్పంటించి దహనం చేశారు. డ్రిఫ్ పరికరాలను ధ్వంసం చేశారు. సుమారు రూ.30 వేల నష్టం చేశారని మహేందర్ వాపోయాడు. తాను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

చోరీకి యత్నం

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటలో ఆదివారం రాత్రి దుండగులు చోరీకి యత్నించారు. స్థానికుల కథనం ప్రకారం.. రెండు ఇండ్ల వద్దకు సగం దుస్తులతో కొందరు వ్యక్తులు వెళ్లారు. జనం ఇండ్ల బయట పడుకోవడంతో ఇళ్లలోకి చొరబడే యత్నం చేసారు. ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును చోరీ చేసేందుకు యత్నించారు. రెండు చోట్ల ఇండ్ల బయట నిద్రిస్తున్న వృద్ధ మహిళలు కేకలు వేయడంతో ఆగంతకులు పరారయ్యారు. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించినట్లు తెలిసింది.

నేడు పంచాంగ శ్రవణం

గీసుకొండ : ఉగాది పర్వదినాన్ని, శ్రీక్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని మండలంలోని ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నేడు (మంగళవారం)శ్రీ కాశేశ్వర సుమన్ శర్మ పంచాంగ శ్రవణం చేస్తారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రజలు పంచాంగ శ్రవణానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ఆర్థికసాయం

నల్లబెల్లి : మండలంలోని రుద్రగూడెంలో నల్ల రవి అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి రవితో కలిసి పదో తరగతి చదువుకున్న స్నేహితులు సోమవారం రూ.20 వేల సాయం అందజేశారు. తొలుత రవి చిత్రపటానికి అతడి మిత్రులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అనంతుల రాజు, తుమ్మల శ్రీనివాస్‌రెడ్డి, అరిగల శ్రీను, ఉడుత రాజేందర్, శివప్రసాద్, తిరుపతి, కరుణాకర్‌రెడ్డి, గోపీ, మోహన్, రవి, సుధాకర్, రామన్న తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథపురంలో..

గీసుకొండ : మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన అజ్మీర లచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ.3 వేల సాయం అందజేశారు. ఆ పార్టీ నాయకులైన అల్లం మర్రెడ్డి, మాదాసి రాంబాబు, కందికొండ రాజ్‌కుమార్, తోట కమలాకర్, బాదావత్ కృష్ణ తదితరుల ద్వారా బాధిత కుటుంబానికి పంపించారు.

నివాళి

రాయపర్తి : మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఊడుగుల భిక్షపతి సతీమణి రామతార సోమవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భిక్షపతిని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఈరెడ్డి నర్సింహారెడ్డి, నర్సయ్య, మహేందర్, భాస్కర్, ఎల్లయ్య, అశోక్, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

లారీ ఓనర్‌పై దాడి

గీసుకొండ : ఫారూఖ్ అలీ, హర్షద్ అలీ, యాకూబ్, ఆసిఫ్ అలీ అనే వ్యక్తులు తనపై దాడికి పాల్పడ్డట్టు వరంగల్ నగరంలోని కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన లారీ ఓనర్ ఠాకూర్ రాకేశ్ సింగ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. రాకేశ్‌సింగ్ గొర్రెకుంట ప్రగతి పారిశ్రామిక ప్రాంతంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్‌లో సభ్యుడు. ఈనెల 6న అసోసియేషన్ అధ్యక్షుడు ఫిరోజ్ అలీ నిబంధనలకు విరుద్ధంగా లారీలో 15 టన్నులకు బదులు 25 టన్నులు లోడ్ చేసుకుని వెళ్తుండగా అడ్డుకుని అసోసియేషన్ ఆఫీసుకు తరలించారు. తదనంతరం వాచ్‌మెన్‌ను బెదిరించి లారీని తీసుకెళ్లగా అసోసియేషన్ ఆఫీసు వద్ద సభ్యులతో రాకేశ్‌సింగ్ మాట్లాడుతుండగా ఫారూఖ్ అలీ, హర్షద్ అలీ, యాకూబ్, ఆసిఫ్ అలీ దాడి చేశారు. ఎక్కువ లోడ్ చేశారని ప్రశ్నించినందుకు తనపై అసోసియేషన్ ప్రతినిధులు దాడి చేశారని రాకేశ్ సింగ్ చెప్పాడు. ఇరువర్గాలు ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



వర్ధన్నపేట : ఎమ్మెల్యేకు డ్రైఫ్రూట్స్ తినిపిస్తున్న స్వర్ణ

వర్ధన్నపేట : రంజాన్, పండుగలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకుని పట్టణ కేంద్రంలోని జామా మసీదులో వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. హిందూముస్లిములు అన్నదమ్ముల్లా కలిసి ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి శేఖర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ అరుణ, నాయకుడు వరద రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రంజాన్ మాసం పవిత్రమైనది

నర్సంపేట : రంజాన్ మాసం ముస్లిములకు అత్యంత పవిత్రమైనదని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సాంబయ్య గౌడ్ తెలిపారు. పట్టణంలోని 22వ డివిజన్‌లోని తాజ్ ఖుర్షీదా మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మౌల్వీసాబ్ సాహెబ్ రాజా, అఖిల్ పాషా, ముస్లిం మత పెద్దలు ఆసీఫ్, ఖలీల్, జలీల్, మహబూబ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఉపాధ్యక్షుడు వేముల సారంగం, సీనియర్ నాయకుడు దండెం రతన్ కుమార్, పట్టణ కార్యదర్శి నాంపల్లి వెంకటేశ్వర్లు, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు కటారి ఉత్తమ్‌కుమార్, 22వ డివిజన్ జనరల్ సెక్రెటరీ తొగరు దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

పల్లారుగూడలో..

సంగెం : మండలంలోని పల్లారుగూడలోని జమ్‌జమ్ మసీదులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇమామ్ అజ్మత్ అలీ, మౌజన్ యాకూబ్ అలీ, ప్రెసిడెంట్ సాహబ్ అలీ, నాయకులు ఫక్రుద్దీన్, జియా, అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జాతర నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ తిరుపతి

సంగెం: మండలంలోని గవిచర్లలో ఉగాది నాడు గుండ బ్రహ్మయ్య జాతరను పార్టీలకతీతంగా శాంతియుతంగా నిర్వహించుకోవాలని మామునూరు ఏసీపీ తిరుపతి అన్నారు. సోమవారం ఆ గ్రామంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా సహకరించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉన్నందున రాజకీయ పార్టీల జెండాలు, ప్రభలకు అనుమతి లేదన్నారు. భక్తులకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై నరేశ్, కార్యదర్శి కిరణ్, ఆలయ చైర్మన్ కొంతం యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెంచేందుకు సహకరించాలి..

పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు సహకరించాలని మామునూర్ ఏసీపీ తిరుపతి కోరారు. గవిచర్లలోని పోలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. సిబ్బంది అప్రమత్తతతో విధులు నిర్వహించాలన్నారు. శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

పర్వతగిరి : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని పీఏసీఎస్ సీఈఓ సురేశ్ తెలిపారు. స్థానిక పీఏసీఎస్ పరిధిలోని పెద్దతండా, బూరుగుమళ్ల, నారాయణపురం, చెరువుకొమ్ముతండాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో ఏఈఓ చందులాల్, సొసైటీ డైరెక్టర్లు దొమ్మడి లక్ష్మీనారాయణ, మల్లాడి అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

రాయపర్తి : దళారులను నమ్మిమోసపోవద్దని స్థానిక పీఏసీఎస్ సీఈఓ ఏడాకుల సోమిరెడ్డి రైతులను కోరారు. మండలంలోని ఊకల్, రాయపర్తి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది ఐత మల్లేశ్, రాకేశ్ పాల్గొన్నారు.



పర్వతగిరి : మాట్లాడుతున్న సీఈఓ సురేశ్

గిర్నిబావిలో..

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో మందపల్లి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని ఏఈఓ మధు ప్రారంభించి మాట్లాడారు. 'ఏ' గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2203, సాధారణ రకానికి క్వింటాకు రూ.2183 చొప్పున చెల్లించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ బాధ్యులు రాజు, రంగు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

గీసుకొండ : మండలంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న పలు షాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. గీసుకొండలోని రెడ్డి డెకరేషన్ వర్క్స్‌లో దోపతి రఘు నుంచి రూ.19,200, స్తంభంపెల్లిలోని పోలెబోయిన సాయికుమార్ కిరాణం షాపు నుంచి రూ.5,140, బెంబిరి కోటేశ్వర్‌రావు కిరాణం షాపు నుంచి రూ.7,140 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యంను తదుపరి చర్యల నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించినట్టు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రవికుమార్ తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది బి.శరత్, తదితరులు పాల్గొన్నారు.

గవిచర్లలో..

సంగెం : మండలంలోని గవిచర్లకు చెందిన పోశాల ఎల్లాగౌడ్ కిరాణం షాపులో అక్రమంగా నిల్వ చేసిన రూ.15,110 విలువైన మద్యం బాటిళ్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఎల్లాగౌడ్ అక్రమంగా బెల్టుషాపు నిర్వహిస్తున్నాడనే సమాచారం మేరకు సిబ్బంది దాడి చేశారని తెలిపారు. మద్యం బాటిళ్లను స్థానిక పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు.

మౌలిక వసతుల కల్పనే కీలకం



దుగ్గొండి : మాట్లాడుతున్న ఎంపీడీఓ అరుంధతి

దుగ్గొండి : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనే కీలకమని ఎంపీడీఓ లెక్కల అరుంధతి తెలిపారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల చైర్మన్లు, హెచ్‌ఎంలకు సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మండలంలోని 46 అమ్మ ఆదర్శ పాఠశాలలకు ప్రభుత్వం రూ.25 వేల చొప్పున మంజూరు చేసిందన్నారు. పాఠశాల చైర్మన్‌గా స్థానిక వీఓ అధ్యక్షురాలు, కన్వీనర్‌గా హెచ్‌ఎం ఉంటారని చెప్పారు. పాఠశాలల్లో మంచినీటి, విద్యుత్, తదితర సదుపాయాల కోసం నిధులను వినియోగించాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, డీపీఎం అనిత, ఏపీఎం రాజ్‌కుమార్, నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, మండల సమాఖ్య అధ్యక్షురాలు లలిత, రజిత పాల్గొన్నారు.

ఖానాపురం : స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ రత్నమాల మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. అత్యవసరంగా చేపట్టాల్సిన పనులను గుర్తించి చేపట్టాలని చెప్పారు. సమావేశంలో ఎంఎన్ఓ చరణ్‌సింగ్, ఏపీఎం సుధాకర్, ఏఈ శోభన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద గ్రామంలో స్థానిక ఆరోగ్య ఉపకేంద్రం–2 ఆధ్వర్యంలో ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలకు సోమవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం సరోజ మాట్లాడారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కూలీలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా వీలైనంత వరకు ఉదయమే పనులు ముగించుకోవాలని సూచించారు. పనివేళల్లో తరచూ మంచినీళ్లు తాగాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామారావు, ఏఎన్ఎం అపరంజి, ఆశ కార్యకర్తలు శోభ, కోమల, ఉపాధి అసిస్టెంట్ రేణుక, పంచాయతీ సిబ్బంది, రాజు, చోటే, వేణు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటా

- బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి రమేశ్

పర్వతగిరి : కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ తెలిపారు. మండలంలోని శ్రీనగర్‌కు చెందిన మాజీ సర్పంచ్‌లు కోరిటాల సుబ్బారావు, గుమ్మడి ప్రసాదరావు, ఉపసర్పంచ్ గుమ్మడి విజయ్‌భాస్కర్ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, పార్లమెంట్ అభ్యర్థి రమేశ్ సమక్షంలో సోమవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ధర్మారావు, రమేశ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రమేశ్ మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా తనకు మద్దతివ్వాలని కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడాన్ని అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వనంరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏకాంతంగౌడ్, నాయకులు రంగు కుమార్, రాజుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న మార్తినేని ధర్మారావు, అరూరి రమేశ్

నూతన ఆవిష్కరణలు అవసరం

నర్సంపేట రూరల్ : ఫార్మసీ విద్యార్థులు నూతన ఆవిష్కరణలు పెంచుకోవాల్సిన అవసరం ఉందని కేయూ ఫార్మసీ విభాగం డీన్ సమ్మయ్య సూచించారు. నర్సంపేట మండలంలోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో «ఇంపాక్ట్ లెక్చర్ సిరీస్» అంశంపై సోమవారం నిర్వహించిన సదస్సుకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. ఐఐఎఫ్‌టీ విద్యార్థులు వ్యవస్థాపక లక్షణాలను పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ప్రొఫెసర్ మురళీధరన్, ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, విభాగాధిపతులు డాక్టర్ మనీశ్, పి.రవి, జె.రవి, తదితరులు పాల్గొన్నారు.

'శ్రీచైతన్య'పై చర్య తీసుకోవాలి

నర్సంపేట : పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏబీఎస్ఎఫ్, ఏఐఎస్ఎఫ్, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్‌బీ నాయకులు డీఈఓకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి లాదెళ్ల శరత్ మాట్లాడారు. శ్రీచైతన్య స్కూల్ యాజమాన్యం ఇటీవల పట్టణంలోని అద్దె భవనంలో పాఠ్యపుస్తకాలు భద్రపరుస్తున్న తరుణంలో సంఘాల ఆధ్వర్యంలో తాము నిలదీసినట్టు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ శ్రీచైతన్య టెక్నో స్కూల్ పేరుతో ముద్రించిన పాఠ్యపుస్తకాల విక్రయానికి పాల్పడుతున్నారని చెప్పారు. తక్షణమే శ్రీచైతన్య స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏఐఎఫ్‌డీఎస్ నాయకుడు ప్రవీణ్, ఏఐఎస్‌బీ నాయకుడు సతీశ్ తదితరులున్నారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం'

సంగెం : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ స్థానంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించడమే లక్ష్యంగా శ్రేణులు పని చేయాలని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కోరారు. హనుమకొండలోని తన నివాసంలో సంగెం మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. సీఎంగా కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. ఎన్నికల హామీలను విస్మరించి ఓటు ఎలా అడుగుతారని కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి ఆదరణ తగ్గిందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సుదర్శన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సారంగపాణి, వైస్ ఎంపీపీ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తుగా ఉగాది వేడుకలు



నర్సంపేట : ఉగాది వేడుకలలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



చెన్నారావుపేట : విద్యార్థులకు ఉగాది పచ్చడి అందిస్తున్న చైర్మన్ గోపాల్‌రెడ్డి

నర్సంపేట : పట్టణంలోని అక్షర ద స్కూల్, బిట్స్ స్కూల్‌లో సోమవారం మినీ ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఉగాది సందర్భంగా కొత్తగా పనులు ప్రారంభించడం సంప్రదాయమని చెప్పారు. కష్టసుఖాలను సంయమనంతో స్వీకరించాలన్న సందేశాన్ని ఉగాది పచ్చడి తెలియజేస్తుందని వివరించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, సెక్రెటరీ డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, సీఏఓ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

'సిద్ధార్థ'లో..

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్‌లో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉగాధి పచ్చడి తయారు చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అండెం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు జగదీశ్, వల్ల వేణు, కృష్ణమోహన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంఘాలతో సమస్యలకు చెక్



మాట్లాడుతున్న ఎస్సై

చెన్నారావుపేట : సంఘాలతో సమస్యలకు చెక్ పెట్టొచ్చని, పరిష్కరించుకోవచ్చని ఎస్సై గూడ అరుణ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని జాగృతి స్కూల్‌లో రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య, వక్త ప్రజ్ఞాపురం దామోదర్, వినియోగదారుల మండలి జిల్లా నాయకులు తేరాల యుగేందర్, మండల కన్వీనర్ ఐత సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో నర్సింహాచారి, తాళ్లపెల్లి కొమ్మయ్య, ములుక సాంబయ్య, పత్తి సంజీవరెడ్డి, ఓరంగంటి మల్లయ్య, కల్వచర్ల సదానందం, కంది నారాయణరెడ్డి, మంచాల కొమ్మాలుతో అడహక్ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం ఎస్సై మాట్లాడారు. ఇబ్బందులు ఏర్పడినపుడు సంఘం ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సంఘాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. సమావేశంలో నాయకులు ములుక ఐలయ్య, సిద్ధ కుమారస్వామి, కుమారస్వామి పాల్గొన్నారు.